రేపు బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

మణుగూరుటౌన్, ఏప్రిల్ 22: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ పార్టీ మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోత్ కవిత ఈ నెల 24వ తేదీన మణుగూరు మండలంలో పర్యటించనున్నారని, ఈ సందర్భంగా 24వ తేదీ ఉదయం 9గంటలకు పట్టణంలోని హనుమాన్ ఫంక్షన్‌హాల్‌లో పినపాక నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు పినపాక మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు సోమవారం తెలిపారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పర్ణశాలలో ఘనంగా వసంతోత్సవం

వసంతోత్సవంలో పాల్గొన్న అర్చకులు

పర్ణశాల, ఏప్రిల్ 22: పర్ణశాల పుణ్యక్షేత్రంలో ఈ నెల 17వ తేదీన జరిగిన నవమిని పురస్కరించుకొని బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఎంతో ఘనంగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

బ్రిలియంట్‌లో విద్యార్థులకు వీడ్కోలు

సారపాక, ఏప్రిల్ 22: సారపాకలోని బ్రిలియంట్ విద్యాలయంలో ఇంగ్లిష్ మీడియం ఎస్ఏ-2 పరీక్షల ముగింపు సందర్భంగా సోమవారం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. విద్యాసంస్థల చైర్మన్ బీఎన్ఆర్ విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్రిలియంట్ విద్యా సంస్థలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఆర్ఎంఎస్ కార్డులు రెన్యువల్ చేయించుకోవాలి

మణుగూరుటౌన్, ఏప్రిల్ 22: విశ్రాంత సింగరేణీయుల కోసం జారీ చేసిన ఆరోగ్య కార్డుల కాంట్రిబ్యూటరీ పోస్ట్ రిటైర్మెంట్ మెడికల్ స్కీం - నాన్ ఎగ్జిక్యూటివ్ (సీపీఆర్ఎంఎస్ -ఎన్ఈ మెడికల్ కార్డుల) కాల పరిమితి ప్రతి ఏటా డిసెంబర్ 31న ముగుస్తుందని, ఈ నేపథ్యంలో ఇప్పటివరకు సీపీఆర్ఎంఎస్ కార్డులు పొందిన ప్రతిఒక్కరు ఏప్రిల్ 30 లోపు రెన్యువల్ చేసుకొని సింగరేణి యాజమాన్యం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మణుగూరు ఏరియా డీజీఎం(పర్సనల్) సలగల రమేశ్ సోమవారం తెలిపారు. రెన్యువల్ చేసుకునేందుకు అభ్యర్థులు(భార్య, భర్త) నేరుగా మీసేవా కేంద్రానికి సీపీఎంఆర్ఎస్ కార్డు, ఆధార్‌కార్డుతో వెళ్లి తమ లైఫ్ సర్టిఫికెట్ గడువును పొడిగించుకోవచ్చునన్నారు. కార్డు కాలపరిమితి పొడిగించుకోవడం ద్వారా సింగరేణితో ఒప్పందం చేసుకున్న కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలను అంతరాయం లేకుండా పొందవచ్చునని పేర్కొన్నారు.

నేలవాలిన మామిడి కాయలు, వరి పంట
నేలకూలిన ఇండ్లు, వృక్షాలు

చంద్రుగొండ, ఏప్రిల్ 22: మండలంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఈదురుగాలులతో కూడిన వర్షం ఈడ్చికొట్టింది. పంటలను దెబ్బతీసింది. ఇండ్లను కూల్చింది. సత్యనారాయణపురం, తుంగారం, గానుగపాడు గ్రామాల్లోని మామిడి తోటల్లో కాయలు నేలపాలయ్యాయి. సత్యనారాయణపురం రైతు గుంపెన పల్లి వెంకటేశ్వర్లుకు చెందిన రెండు ఎకరాల్లోని మామిడి తోటలో సుమారు రెండు టన్నుల మామిడి కాయలు రాలాయి. వీటి విలువ రూ.1.50 లక్షల ఉంటుందని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. తిప్పనపల్లి గ్రామంలోని షేక్ నబీకి చెందిన రేకుల ఇంటిపై ఆదివారం రాత్రి వేప చెట్టు పడింది. రేకులు పగిలిపోయాయి. గోడలు బీటలిచ్చాయి. చెట్టు పడిన సమయంలో గాఢ నిద్రలో ఉన్న నబీ, కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళనతో బయటకు పరుగు తీశారు.

కొత్తగూడెం పట్టణంలో..

కొత్తగూడెం అర్బన్: కొత్తగూడెం పట్టణంలో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షానికి పెద్ద పెద్ద చెట్లు విరిగిపడ్డాయి. నాలుగో వార్డులో రోడ్డుపై చెట్లు పడటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందేర్పడింది.

టేకులపల్లి మండలంలో..

టేకులపల్లి: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షంతో మామిడి తోటలకు భారీ నష్టం వాటిల్లింది. చింతోనిచెలక, సంపత్‌నగర్, బోడు గ్రామాల్లోని మామిడి తోటల్లో కాయలు నేలరాలాయి, శంభునిగూడెం పంచాయతీలో వరి నేలకొరిగింది. కొన్ని గ్రామాల్లో చెట్లు విరిగి విద్యుత్ తీగలపై పడటంతో సరఫరా నిలిచిపోయింది. దాస్‌తండా గ్రామంలో బానోత్ పార్వతి ఇంటి పైకప్పు రేకులు పగిలిపోయాయి.

ఇల్లెందు మండలంలో..

ఇల్లెందు రూరల్: మండలంలో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. నెహ్రూనగర్, ఆంజనేయపురం తదితర గ్రామాల్లో ఇండ్లు,

వర్షాలు, ఈదురు గాలులు..
ఈడ్చికొట్టాయి

చండ్రుగొండ: మామిడి తోటలో రాలిన కాయలు

ఇల్లెందు రూరల్: కూలిన ఇండ్లు

కొత్తగూడెం అర్బన్: రోడ్డుకు అడ్డంగా పడిన చెట్లు

కరకగూడెం : ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ

విద్యుత్ స్తంభాలు కూలాయి. పంటలు దెబ్బతిన్నాయి.

తడిసిన ధాన్యం పరిశీలన

కరకగూడెం: ఆదివారం కురిసిన అకాల వర్షంతో గ్రామాలు అతలాకుతలమయ్యాయి. రైతులు ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిముద్దయింది. పలు చోట్ల వరి పంట వర్షానికి దెబ్బతిన్నది. ఏడీఏ తాతారావు మండలంలోని పద్మాపురం, చిరుమళ్ల, అనంతారం గ్రామాల్లో పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రభుత్వానికి నివేదికలు పంపిస్తామని భరోసా కల్పించారు. మండల వ్యవసాయ విస్తరణ అధికారులు అనిల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

చర్యలు చేపట్టాలని కూనంనేని విజ్ఞప్తి

కొత్తగూడెం అర్బన్: జిల్లా వ్యాప్తంగా అకాల వర్షంతో జరిగిన నష్టం నుంచి బాధితులు కోలుకునేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కు, విద్యుత్ అధికారులకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. వారితో ఆయన సోమవారం ఫోన్‌లో మాట్లాడారు.

కొనుగోలు కేంద్రంలోని ధాన్యం పరిశీలన

తేమను పరిశీలిస్తున్న అధికారులు

పాల్వంచ రూరల్, ఏప్రిల్ 22: మండలంలోని సోములగూడెంలోగల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బి.బాబూరావు సోమవారం సందర్శించారు. ధాన్యాన్ని పరిశీలించారు. తేమ శాతం 17కు తగ్గకండా జాగ్రత పడాలని రైతులను కోరారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో ధాన్యానికి ఎటువంటి నష్టం కలగలేదని అన్నారు. అధికారులు రమేష్, రవికుమార్, శంకర్, లక్ష్మినారాయణ, సత్యం పాల్గొన్నారు.

ఘనంగా జ్యోతిర్లింగ ప్రతిష్ఠ

భద్రాచలం, ఏప్రిల్ 22: పట్టణంలోని శిల్పినగర్‌లో ఉన్న శ్రీదుర్గా గాయత్రి సర్వదేవతా సన్నిధానంలో సోమవారం ఉదయం 7.58 గంటలకు ధ్వజస్థంభ, ద్వాదశ జ్యోతిర్లింగాలు, దక్షిణామూర్తి, కాలభైరవ స్వామి వారి విగ్రహాలను ఉప దేవతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారని ఆలయ వ్యవస్థాపకులు కేవీ సుబ్రహ్మణ్య శర్మ తెలిపారు.

ముగిసిన కంటి వైద్యశిబిరాలు

మణుగూరుటౌన్, ఏప్రిల్ 22: వారం రోజులుగా మణుగూరు, పినపాక, కరకగూడెం, అశ్వాపురం మండలాల్లోని ప్రభుత్వ హాస్టళ్లలో నిర్వహించిన కంటి వైద్యశిబిరాలు సోమవారం ముగిశాయి. ఆయా మండలాల్లోని 15 ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లలో చదువుకుంటున్న సుమారు 2,599 మంది విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు చేసినట్లు ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ డాక్టర్ గోపీలాల్, నేత్ర వైద్యాధికారి జి.సంజీవరావ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే ఫార్మసిస్ట్ సరస్వతి, ఏఎన్ఎం పుష్ప, సిబ్బంది వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్స్, వారెన్లు పాల్గొన్నారు.

ఘనంగా లెనిన్ జయంతి

సారపాక, ఏప్రిల్ 22: రాజకీయ సిద్ధాంతకర్త, రష్యా బోల్షెవిక్ పార్టీ వ్యవస్థాపకుడు లెనిన్ 154వ జయంతి వేడుకలను సారపాకలో సీపీఎం మండల కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను కొనియాడారు. రాము, తిరుపతిరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాదరక్షలు పంపిణీ

సారపాక, ఏప్రిల్ 22 : ఐటీసీ అనుబంధ సంస్థ రోటరీక్లబ్ ఆఫ్ ఇన్ భద్ర ఆధ్వర్యంలో 3150 డిస్ట్రిక్ట్ గవర్నర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి సారపాక లోని గాంధీనగర్‌లో ఉన్న శ్రీసత్యసాయి మోడల్ స్కూల్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా శంకర్‌రెడ్డికి క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయంత్‌కుమార్ దాస్, గోవిందరావు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. పాఠశాల పిల్లలకు రోటరీ గవర్నర్ చేతులమీదుగా పాదరక్షలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. క్లబ్ బాధ్యులు, పాఠశాల యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏకలవ్య మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

భద్రాచలం, ఏప్రిల్ 22: ఏకలవ్య మోడల్ సంక్షేమ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 28న పరీక్ష నిర్వహించడం జరుగుతుందని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్, ఖమ్మం రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి తుమికి వెంకటేశ్వరరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రామవరం, ఏప్రిల్ 22: సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని నిరుద్యోగ యువతకు స్కిల్డ్ డెవలప్‌మెంట్ కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జీఎం శాలెంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని (సింగరేణి) మాజీ ఉద్యోగుల పిల్లలు, ప్రాజెక్ట్ ప్రభావిత-పరిసర-పునరావాస ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత నుంచి ఈ శిక్షణ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. మొత్తం 38 వృత్తి కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. కాస్మొటాలజీ (మహిళలు), డ్రోన్ టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, సెల్ టెక్నీషియన్, టూ వీలర్ మెకానిజం, ఆర్‌కే గ్యాస్ వెల్డింగ్, డెస్క్ టాప్ పబ్లిషింగ్(డీటీపీ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ తదితర కోర్సులు ఉన్నాయని వివరించారు. దరఖాస్తుదారులు డిగ్రీ/డిప్లొమా/ఐటీఐ/పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. ఒక్కొక్క బ్యాచ్‌లో 20 మందిని ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. దరఖాస్తు చేసేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉందని పేర్కొన్నారు.

ఒకే ఒక్క వర్షానికి.. 'నాణ్యత' కొట్టుకుపోయింది..!

మట్టి కొట్టుకుపోవడంతో కుంగిన గోడలు

రామవరం, ఏప్రిల్ 22: రుద్రంపూర్ ప్రొఫెసర్ జయశంకర్ గ్రౌండ్‌లో క్రీడాకారులు, వాకర్స్ సౌకర్యార్థం మరుగుదొడ్లను సింగరేణి యాజమాన్యం నిర్మిస్తున్నది. ఆదివారం కురిసిన వర్షానికి మరుగుదొడ్ల పక్కన ఉన్న మట్టి కొట్టుకుపోయింది. దీంతో గోడలు కుంగిపోయాయి. దీనిని చూసిన క్రీడాకారులు, వాకర్స్.. ''కేవలం ఒక్క రోజు కురిసిన వర్షానికే గోడలు కుంగిపోతే.. రాబోయే వర్షాకాలంలో విస్తారంగా కురిసే వర్షాలకు ఈ మరుగుదొడ్లు ఉంటాయా..?'' అని, సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ''ఒకే ఒక్క వర్షానికి నాణ్యతా ప్రమాణాలు కొట్టుకుపోయాయి'' అని, ఎద్దేవా చేస్తున్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో నైపుణ్యత పెంచుకోవాలి

విద్యార్థులతో మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు

మణుగూరుటౌన్, ఏప్రిల్ 22: విద్యార్థులు అన్ని రంగాల్లోనూ నైపుణ్యతను పెంచుకోవాలని మణుగూరు ఫస్ట్‌క్లాస్ జ్యూడీషియల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని ఎక్స్‌లెంట్ స్టార్ హైస్కూలులో సోమవారం 3, 4, 5 ఒలింపియాడ్, స్టార్ తరగతుల విద్యార్థులకు నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతోపాటు ఇతర రంగాల్లో సైతం నైపుణ్యత పెంచుకొని ఉత్తమంగా రాణించాలన్నారు. విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల చైర్మన్ ఎండీ. యూసఫ్‌షరీఫ్, కరస్పాండెంట్ ఎండీ.ఖాదర్, డైరెక్టర్ యూసఫ్‌షరీఫ్, ప్రైమరీ ప్రిన్సిపాల్ సమియా నయ్యర్ పాల్గొన్నారు.

స్వామివారి సేవలో రాష్ట్ర డీజీపీ రవిగుప్తా

స్వామివారి సేవలో డీజీపీ రవిగుప్తా, అడిషనల్ డీజీపీ (ఇంటెలిజెన్స్) శివధర్‌రెడ్డి, ఎస్ఐబీ ఐజీపీ సుమతి

భద్రాచలం, ఏప్రిల్ 22: భద్రాచలం సీతారామచంద్రస్వామివారిని సోమవారం రాష్ట్ర డీజీపీ రవిగుప్తా, అడిషనల్ డీజీపీ (ఇంటెలిజెన్స్) శివధర్ రెడ్డి, ఎస్ఐబీ (ఐజీపీ) సుమతి ఐపీఎస్, గ్రేహౌండ్స్ అడిషనల్ డీజీ విజయ్‌కుమార్, సీఆర్పీఎఫ్ సౌత్‌జోన్ (అడిషనల్) డీజీపీ రవిదీప్ సింగ్ సాహి, సీఆర్పీఎఫ్ డీజీ ఎస్పీ శబరి, తదితరులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ముందుగా ధ్వజస్థంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో ఎల్ రమాదేవి, ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అమరవాది విజయ రాఘవన్, ఎస్సీ రోహిత్‌రాజ్, ఏఎస్పీ పరితోశ్ పంకజ్ తదితరులు ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ అభ్యర్థి కవిత నామినేషన్

ఇల్లెందు, ఏప్రిల్ 22: మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపీ కవిత మంగళవారం ఉదయం 10.30 గంటలకు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఆమె ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై తనను ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

టేకులపల్లి, ఏప్రిల్ 22: మాలోత్ కవిత నామినేషన్ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు, ప్రజలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్ కోరారు. ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు.

తాగునీటి బోరుకు మరమ్మతులు

చుంచుపల్లి, ఏప్రిల్ 22: మండలంలోని పెనగడప పంచాయతీ ప్రజలు మూడు రోజులుగా పడుతున్న తాగునీటి కష్టాలను వివరిస్తూ 'నమస్తే తెలంగాణ' లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వారు సోమవారం గ్రామంలోని బోరుకు మరమ్మతు చేయించారు.

పోలింగ్ కేంద్రం మార్పు

బూర్గంపహాడ్, ఏప్రిల్ 22: మండల పరిధిలోని మోరంపల్లిబంజర్‌లో ఉన్న ఎంపీపీఎస్ పోలింగ్‌స్టేషన్(237) వేపలగడ్డలోని ప్రైమరీ స్కూల్‌కు మార్చినట్లు తహసీల్దార్ ముజాహిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 852 ఓటర్లు వేపలగడ్డకు చెందిన వారు ఉండడంతో 2 కిలోమీటర్ల దూరం వచ్చి ఓటు వేయాల్సి వస్తుందనుదన మార్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 227(ప్రభుత్వ జూనియర్ కళాశాల) పోలింగ్ కేంద్రం పేరు తప్పుగా(ఎంపీపీఎస్ బూర్గంపహాడ్) నమోదైందని, ఆ పేరును ప్రభుత్వ జూనియర్ కళాశాల, బూర్గంపహాడ్‌గా మార్చినట్లు తెలిపారు.

క్షయ వ్యాధిపై అవగాహన

మణుగూరుటౌన్, ఏప్రిల్ 22: మండలంలోని అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం వైద్యసిబ్బంది క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

అభినందనలు అందుకుంటున్న విద్యార్థులు

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 22: తెలంగాణ గురుకుల విద్యాలయాల్లోకి ప్రవేశానికి ఎంపికైన ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు హంసిని, రిత్విక్ అభిరామ్‌ను హెచ్ఎం మేకల జ్యోతి రాణి సోమవారం అభినందించారు. వారికి, వారి తల్లిదండ్రులకు పుష్పగుచ్ఛం అందించారు.

జూలూరుపాడు, ఏప్రిల్ 22: గురుకుల విద్యాలయాల్లో ప్రవేశానికి మండలం నుంచి ఎంపికైన విద్యార్థులను రిటైర్డ్ ఎంఈవో మద్ధిశెట్టి వెంకటేశ్వర్లు సోమవారం అభినందించారు.

మానసిక ఒత్తిడితో ఉన్నారా.. 14416కు కాల్ చేయండి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 22: ఈ నెలాఖరులో పదోతరగతి, ఇంటర్ ఫలితాలు వెలువడనున్నాయి. ఉత్తీర్ణత/ఆశించిన జీపీఏ సాధించలేకపోయి విద్యార్థుల్లో కొందరు మానసిక ఒత్తిడికి, భయాందోళనకు లోనవుతుంటారు. దీని నుంచి వారిని బయటపడేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 'టెలీమానస్' పేరుతో టోల్ ఫ్రీ నంబర్ 14416ను అందుబాటులోకి తెచ్చింది. డీఎంహెచ్‌వో డాక్టర్ శిరీష ఓ ప్రకటనలో ఈ విషయం తెలిపారు. విద్యార్థులు ఈ నంబరుకు కాల్ చేసి, తమ మానసిక ఒత్తిడిని తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులు సేవలందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండాలని, వారికి మనోధైర్యం ఇవ్వాలని కోరారు.

నవ వధువు ఆత్మహత్య

చండ్రుగొండ, ఏప్రిల్ 22: నవ వధువు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఆమె కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాలు.. చండ్రుగొండ మండలం మంగయ్యబంజర గ్రామానికి చెందిన భూక్యా శ్రీను-పద్మ దంపతుల ఏకైక కుమార్తె దేవిక(23)కు, ఇదే మండలం దుబ్బతండా గ్రామస్తుడు గుగులోత్ బాలరాజుతో గత నెల 28న పెండ్లి చేశారు. నవ దంపతులను ఈ నెల 12న మంగయ్య బంజరకు తీసుకొచ్చారు. ఆ మరుసటి రోజు (13వ తేదీ) అర్ధరాత్రి వేళ, ఇంట్లో ఉన్న పురుగుల మందును ఆ నవ వధువు తాగింది. కుటుంబ సభ్యులు వెంటనే జూలూరుపాడు ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. కొద్ది రోజులపాటు అక్కడ చికిత్స పొందింది. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆమె అక్కడే సోమవారం (21వ తేదీ) రాత్రి మృతిచెందింది. ఉన్నత చదువులు చదవాలని తమ కూతురు ఆశ పడిందని, అది నెరవేరలేదన్న మనోవేదనతోనే ఆత్మహత్య చేసుకున్నదని ఆమె తల్లి పద్మ ఇచ్చిన ఫిర్యాదుతో ఎస్సై రవి కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టారు. ఆస్పత్రిలో దేవిక మృతదేహాన్ని తహసీల్దార్ సంధ్యారాణి సందర్శించి, కుటుంబీకుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

సోలార్ ప్లాంట్ పరిశీలన

రామవరం, ఏప్రిల్ 22: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలో, టూటౌన్ పోలీస్ స్టేషన్ ఎదురుగాగల 10.5 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్‌ను ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు సోమవారం పరిశీలించారు. సోలార్ మోడల్ హౌస్ పనుల పురోగతిని అధికారుల నుంచి తెలుసుకున్నారు. జీఎం (సోలార్ ఎనర్జీ) జానకీరాం, ఏజీఎంలు దుర్గాప్రసాద్ (ఈఅండ్ఎం), రామకృష్ణ (సివిల్), సోలార్ ప్లాంట్ ఇన్‌చార్జ్ శంకర్ పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

అశ్వారావుపేట, ఏప్రిల్ 22: పట్టణంలోని భద్రాచలం రోడ్డులోగల మహాలక్ష్మి మద్యం దుకాణంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. రూ.95వేల విలువైన మద్యం సీసాలను తీసుకెళ్లారు. దుకాణం యజమాని మల్లికార్జునరావు ఫిర్యాదుతో కేసును ఎస్సై శ్రీరాముల శ్రీను దర్యాప్తు చేస్తున్నారు.

మణుగూరు ఏరియాలో సింగరేణి డైరెక్టర్ల పర్యటన

వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్లు, అధికారులు

మణుగూరుటౌన్, ఏప్రిల్ 22: మణుగూరు ఏరియాలో సింగరేణి సంస్థ డైరెక్టర్లు డైరెక్టర్(ఆపరేషన్స్), (పీఏడబ్ల్యూ) ఎస్.వీ.కే శ్రీనివాస్, డైరెక్టర్(పీ అండ్‌పీ) జి.వెంకటేశ్వరరెడ్డి సోమవారం జీఎం దుర్గం రామచందర్, సంబంధిత అధికారులతో కలిసి పర్యటించారు. పీకే ఓసీ-2, పీకేఓసీ-4 గనుల వ్యూప్యాంట్‌ల నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రక్రియను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ సింగరేణి మొత్తంలో అధిక ఉత్పత్తి సాధనలో మణుగూరు ఏరియా అగ్రగామిగా నిలిచిందని, ఇదే స్ఫూర్తితో 2024-25 సంవత్సర నిర్ధేశిత లక్ష్యమైన 126.5 లక్షల టన్నుల ఉత్పత్తిని సాధించేందుకు అధికారులు, కార్మికులు, సూపర్వైజర్లు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం వారు పీకేఓసీ-2 నూతన సైట్ ఆఫీస్ ప్రాంగణంలో నెలకొల్పిన శ్రీకనకదుర్గా అమ్మవారి ఆలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అధికారులు పీవీకాలనీలోని రహదారుల స్థితిగతులను పరిశీలించారు. పీకేఓసీ ప్రాజెక్టు అధికారి లక్ష్మీపతిగౌడ్, ఏజీఎం(సివిల్) డి.వెంకటేశ్వర్లు, డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, డీజీఎం(ఐఈడీ) వెంకట్రావు, ప్రాజెక్టు మేనేజర్‌లు రాంబాబు, వీరభద్రుడు, రమణారెడ్డి, సేఫ్టీ ఆఫీసర్ లింగబాబు, పర్యావరణ అధికారి శ్రీనివాస్, సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, సర్వే అధికారి చిట్టి శ్రీనివాస్, ఆఫ్ లోడింగ్ అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓట్లేద్దాం.. కేసీఆర్‌ను గెలిపిద్దాం..!

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

అశ్వారావుపేట రూరల్, ఏప్రిల్ 22: బీఆర్ఎస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావును విజయాన్ని కాంక్షిస్తూ ఆ పార్టీ నాయకుడు, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి సోమవారం మండలంలో విస్తృతంగా ప్రచారం చేశారు. ఉట్లపల్లి, వినాయకపురం, ఆసుపాక, నందిపాడు, వడ్డెర రంగాపురం, గుమ్మడవల్లి, బచ్చువారిగూడెం పంచాయతీల్లో పార్టీ బూత్ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలతో ఆయన మాట్లాడుతూ.. ''ఇక్కడ నామా గెలిస్తే.. మాజీ సీఎం కేసీఆర్ గెలిచినట్లే''నని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని, ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నాయకులు డాక్టర్ భూక్యా ప్రసాద్, వగ్గెల పూజ, యూఎస్ ప్రకాశరావు, వెంకన్నబాబు, జూపల్లి వెంకట రమణారావు, మందపాటి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'విశాఖ'లో ఆరుగురు మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం క్రైం, ఏప్రిల్ 22: ఏపీలోని విశాఖపట్నం జిల్లాలో ఆరుగురు హార్డ్ కోర్ మావోయిస్టులు విశాఖపట్నం రేంజ్ డీఐజీ విశాల్ గున్ని ఎదుట సోమవారం లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో కూరం మిథిలేశ్ అలియార్ రాజు (డీవీసీఎం, కిష్టారం, చత్తీస్‌గఢ్), బర్సి మాసా (ఏసీఎం), వెట్టి భీమా (ఏసీఎం), వంజం రామే (ఏసీఎం), మడకం సుక్కి (పార్టీ సభ్యురాలు), దుడి సోని (పార్టీ సభ్యురాలు) ఉన్నట్లు పోలీసు అధికారులు తెలిపారు. మిథిలేశ్‌పై రూ.5 లక్షలు, మాసా, వెట్టి భీమా, రామేలపై రూ.4 లక్షలు, సుక్కి, సోనిలపై రూ.లక్ష చొప్పున రివార్డ